క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని జ్యోతి అనాథ, వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి పౌండర్ చలమాల హైమావతి ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. షీటీం ఎస్సై రమాదేవి, రెంట్లపల్లి మాధవిలత, ఉదయ్‌కుమార్, విజయ్, మంజుల, వాసర్ల నాగమణి, మాధవి, దినకర్, యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి వితరణ

సింగరేణి(కొత్తగూడెం): తల్లి జన్మదినం సందర్భంగా కుమారుడు సురేందర్ నాయక్ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి మంగళవారం రూ.10 వేలు వితరణగా అందజేశారు. దీంతో పాటు 2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మరో రూ.10 వేలు అందజేశారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: శాంతియుతంగా మతపరమైన పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జూన్ 7న జరనున్న బక్రీద్ పండుగ సందర్భంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు.

ప్లాంటేషన్లను కాపాడండి..

జూలూరుపాడు: అగ్ని ప్రమాదాల వల్ల ప్లాంటేషన్లకు నష్టం కలగకుండా చూడాలని అటవీ విజిలెన్స్ డీఎఫ్‌ఓ జి.ముకుందరెడ్డి అన్నారు. మంగళవారం అటవీ విజిలెన్స్ సిబ్బందితో కలిసి గుండెపుడి, రాజారావుపేట అటవీ సెక్షన్ల పరిధిలోని గుండెపుడి, రాజారావుపేట, వినోభానగర్ బీట్‌లోని మారు జాతి ప్లాంటేషన్లను పరిశీలించారు. ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు, గుండెపుడి డీఆర్‌ఓ నాసూర్‌భీ, రాజారావుపేట ఎఫ్ఎస్‌ఓ సలీం, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

నేడు కార్మికులకు కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): గనులు, డిపార్ట్‌మెంట్లలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు ఈనెల 14న రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బంజారాలను తొలగించాలి

ఇల్లెందురూరల్: ఎస్టీ జాబితా నుంచి బంజారాలను తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని, ఈ మేరకు ఈనెల 28న ఇల్లెందులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. సుభాష్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కనీస వేతనం ఇవ్వండి..

జూలూరుపాడు: ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించడంతోపాటు, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండలం వీరభద్రాపురం గ్రామంలో ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతానికి ఎన్డీ నాయకులు వెళ్లి పరిశీలించి, వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు: రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం జూలూరుపాడులో రైతులతో మాట్లాడారు. డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి ముగురే రావాలని, పదుల సంఖ్యలో రావద్దన్నారు.

నిధులు మంజూరు

జూలూరుపాడు: తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి(ఎల్‌డబ్ల్యూఈ) నిధులు రూ.11 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పడమటనర్సాపురం-అన్నారుపాడు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 6.50 కోట్లు, కొమ్ముగూడెం - సుజాతనగర్ మండలం రాఘవాపురం బీటీ రోడ్డుకు రూ 4.52 కోట్లు మంజూరు చేసింది.

బైక్ అదుపు తప్పడంతో గాయాలు

టేకులపల్లి: గేదెలు తగలడంతో బైక్ అదుపు తప్పి కింద పడగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్యాలంపాడు క్రాస్‌కు చెందిన భద్రు బైక్‌పై మంగళవారం రాత్రి చుక్కాలబోడు నుంచి వస్తుండగా మంగళితండా సమీపాన గేదెలు అడ్డొచ్చాయి. అవి బైక్‌ను ఢీకొనగా కింద పడిన భద్రు తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 ఫోన్ చేస్తే అంబులెన్స్ అందుబాటులో లేదని చెప్పారు. దీంతో ఆయన ఫోన్ నుంచి సమాచారం ఇవ్వగా భద్రు కుమారుడు వచ్చాడు. అదే సయాన బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కారులో వెళ్తూ క్షతగాత్రున్ని సులానగర్ పీహెచ్‌సీకి, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కేటీపీఎస్ కాలువ పొడవునా రక్షణ ఏర్పాట్లలో నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



కేటీపీఎస్ కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ కెనాల్‌లో ప్రమాదం పొంచి ఉంది. సరదా కోసం ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. ఇందులో మొసళ్లు కూడా సంచరిస్తున్నాయి. కేటీపీఎస్ కర్మాగారానికి నీటిని సరఫరా చేసే కాలువ ప్రమాదకరంగా మారింది.

సమ్మర్‌లోనే ప్రమాదాలు...

కిన్నెరసాని ప్రాజెక్టు దగ్గర నుంచి కేటీపీఎస్ కరకవాగు వరకు కెనాల్ పది కిలోమీటర్లు పొడవు ఉంది. ఇందులో నిత్యం నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. గాజులగూడెం వద్ద కేటీపీఎస్ కాలువ నీటిలో లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్‌నగర్ కాలనీకి చెందిన జక్కినబోయిన అనిల్‌కుమార్, ఎస్‌డీ.సోహెబ్‌పాషా ఈతకు వెళ్లి కాల్వ నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. అంతకు ముందు పాల్వంచ పట్టణంలోని గట్టాయిగూడెంకు చెందిన గుండా పుష్పలత, మంచికంటినగర్‌కు చెందిన కిన్నెరసాని డీర్ పార్కు వద్ద ఇదే కాలువ నీటిలో దివ్యాంగుడైన రాములు, ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడి మృతి చెందారు. గాజులగూడెం వద్ద కేటీపీఎస్ కాల్వలో ప్రమాదవశాత్తు పడి సిద్దుల రక్షిత్(11) మృతి చెందాడు. ఇలా అనేక ప్రమాదాలకు కారణమతున్న కేటీపీఎస్ కాల్వ పొడవునా రక్షణ చర్యలు తీసుకోవడంలో మాత్రం సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి కోసం అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు 10 కిలోమీటర్ల పొడవున కాల్వ నిర్మాణం చేశారు. కాల్వ పొడువున గిరిజన గ్రామాలైన కరకవాగు, గాజులగూడెం, దుబ్బతండా, కాల్వతండా, పూసలతండా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో కేటీపీఎస్ కాల్వకు ఇరువైపుల ఎలాంటి రక్షణ లేదు. కాల్వ నీటిని కొంతమంది రైతులు పంటలకు వినియోగించుకునేందుకు తరుచు కాల్వలోకి దిగుతారు. గిరిజన గ్రామాల ప్రజలు కూడా బట్టలు ఉతికేందుకు కాల్వలో నీటినే వినియోగించుకుంటారు. ఇలా ఇక్కడి గిరిజన ప్రజలు నిత్యం పగలు, రాత్రి కాల్వ పక్క నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కొంతమంది కాల్వకు అవతలి వైపున ఉన్న ఇళ్లకు వెళ్లడానికి కాల్వపై ఒక్క కట్టే మొద్దు వేసి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి సమయంలో కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. వేసవికాలం, హోలీ పండగ సమయాల్లో పాల్వంచ పట్టణం, కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన యువకులు కేటీపీఎస్ కాల్వలో సరదాగా ఈత కొడుతుంటారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గాజులగూడెం వద్ద కాల్వ ఎదుట ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. అక్కడ కాల్వ ఎత్తు ఉన్న దిగువకు తక్కువ ఎత్తులో ఉండటంతో విద్యార్థులు, స్థానికులు కాల్వలోకి దిగి ఈత కొడతారు. అదే సమయంలో ప్రమాదవశాత్తు కాల్వ నీటిలో పడి గల్లంతవుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద నాలుగేళ్ల క్రితం వచ్చిన ములకలపల్లి మండలం మాదారం గ్రామ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు కాల్వలో పడి మృత్యువాత పడ్డారు. దీంతో ఇక్కడ కాల్వలోకి దిగకుండా ఇనుప కంచెను నిర్మాణం చేసి గేటును ఏర్పాటు చేశారు. అదేవిధంగా కరవాగు వద్ద కూడా గతంలో రెండు మూడు ప్రమాదాలు జరిగితే అక్కడ కూడా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. కేటీపీఎస్ కాల్వ పొడవున ఉన్న గిరిజన గ్రామాల వద్ద గతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా పట్టించుకోకుండా స్థానికులు కాలువలో ఈతలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కేటీపీఎస్ కాల్వ నీటిలో వరసగా జరుగుతున్న ప్రమాదాలపై కలెక్టర్ స్పందించి కేటీపీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా అమలు జరగడం లేదు.



కెనాల్ వెంట ఏర్పాటు చేసిన హెచ్చరికబోర్డు



కాలువలో సంచరిస్తున్న మొసలి

రక్షణ చర్యలు తీసుకుంటున్నాం...



కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి నీరు సరఫరా జరిగే కాల్వ పొడువున రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. కాల్వలోకి దిగకుండా అవగాహన కల్పించడమే కాకుండా ఇనుప కంచెను ఏర్పాటు చేస్తే స్థానికులు తొలగిస్తున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తాం. సిబ్బంది ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

– ప్రభాకర్‌రావు, కేటీపీఎస్, సీఈ

సమ్మె నోటీసు అందజేసిన కార్మికులు



జూలూరుపాడు: ఎంపీడీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

జూలూరుపాడు: ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులు ముందుస్తుగా జూలూపాడు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగు, ధన్వంతరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈర్యా, నరేష్, వినోద్, మురళీ, వెంకటేష్, సంజీవరావు, సురేష్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ రీజియన్ ప్రధాన కార్యదర్శి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేట్ ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల అడ్డాలలో సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కృష్ణ, చంద్రకళ, సంధ్య, పోశం దేవి, గంగ, మంగ, భగవాన్, జవహర్‌లాల్, సునీత పాల్గొన్నారు.

ఎస్‌సీసీడబ్ల్యూ సహాయ కార్యదర్శిగా నాగేశ్వరరావు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ - ఇఫ్టూ) సహాయ కార్యదర్శిగా గొని నాగేశ్వరరావును ఆ యూనియన్ ఎన్నుకుంది. ఈనెల 11న భూపాలపల్లిలో జరిగిన రెండు యూనియన్ల విలీన సభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రాసుద్దీన్, కార్యదర్శిగా వెంకన్నలను ఎన్నుకున్నారు.

పాలిసెట్‌కు 23మంది గైర్హాజరు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 400 మంది విద్యార్థులకు గాను 377మంది హాజరు కాగా 23మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న వెంకటేశ్వరచారి

పాల్వంచ: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు వృత్యంతర శిక్షణ తరగతులను ప్రారంభించారు. మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో భాగంగా ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ పాఠశాలలే సరైన వేదికలని, అందరూ సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తరగతులను కూడా నిర్వహించనున్నామని తెలిపారు. బడిబాట కార్యాక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే.సైదులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కొరకు ప్రత్యేకంగా భవితా కేంద్రాలను నిర్వహిస్తున్నామని, ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో దివ్యాంగ బాలలకు అవగాహన కలిగించే నైపుణ్యాలను ఉపాధ్యాయులకు అందిస్తామన్నారు. అనంతరం పాల్వంచ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని సమ్మర్ క్యాంప్‌లో పిల్లలు తయారు చేస్తున్న బొమ్మలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగమ్మ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ తులసీ, జిల్లా రిసోర్స్ పర్సన్లు సురేష్‌కుమార్, ప్రణీత్ కుమార్, సతీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

సుజాతనగర్: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సుజాతనగర్ చింతలపూడి సత్యం భవన్ నుంచి ఎంపీడీఓ ఆఫీస్ వరకు ప్రజలు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. కనకయ్య, కున్సోత్ ధర్మ, భాస్కరరావు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం?

పాల్వంచ: ఈతకు వెళ్తున్నట్లు చెప్పిన యువకుడు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఖమ్మంకు చెందిన గడ్డం మోక్షిత్ పని నిమిత్తం నలుగురితో కలిసి కొత్తగూడెం వచ్చాడు. ఈక్రమాన పాల్వంచలోని కరకవాగులో బంధువుల ఇంటికి చేరుకోగా, మంగళవారం గాజులగూడెం వద్ద కేటీపీఎస్ కాల్వలో ఈతకు వెళ్లాడు. కాసేపటికి ఆయన కనిపించకపోవడంతో కాల్వలో దిగి కొట్టుకుపోయాడా అన్న అనుమానంతో కుటుంబీకులను పోలీసులను ఆశ్రయించారు. దీంతో కాల్వ నీటిని తగ్గించాలని కేటీపీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రవాహం తగ్గాక వెతికినా ఆచూకీ తెలియరాలేదని ఎస్సై సుమన్ తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ పంచాయతీ లలితాపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ ఇర్ప లక్ష్మయ్య (55) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. ఉపాధి పనికి వెళ్లిన లక్ష్మయ్య పని ప్రదేశం వద్దే సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి కూలీలు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వెళ్లి, చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

జూలూరుపాడు: భవిష్యత్ నీటి భద్రతకు ప్రతీఒక్కరు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నీటి పరిష్కారం కోసం ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. వర్షపు నీటి వినియోగం ద్వారా భూగర్భ జలాలను భద్రపరచడం, భవిష్యత్‌లో నీటి కొరతను నివారించడానికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, బోరు బావుల సమీపంలో, చేతి పంపులు వద్ద, పల్లె ప్రకృతి వనాల్లో ఇంకుడు గుంతలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గోదావరి జలాలు ఇల్లెందుకు అందించాలి



భట్టికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లెందు ప్రాంతానికి అందించాలని ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు కోరారు. ఈ సందర్భంగా టేకులపల్లి పర్యటనకు వెళ్తున్న డిప్యూటీ సీఎంకు ఆయన మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలాగే, కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు చేయాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని తుపాకుల నాగేశ్వరరావు తదితరులతో కలిసి కోరారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఇల్లెందులో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, జానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ సైతం డిప్యూటీ సీఎం భట్టిని కలిశారు. అంతేకాక కోయగూడెం ఓసీ నిర్వాసితులకు హైకోర్టు తీర్పు ప్రకారం పరిహారం చెల్లించాలని తెలంగాణ భూనిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ఆధ్వర్యాన డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఇంకా పూసపల్లి ఓసీ నిర్వాసితులకు పరిహారం, సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్న కార్మికులకే ఇళ్లు కేటాయించాలని అఖిలపక్షం నాయకులు కోరారు.

‘సీతారామ’ను చెరువులకు అనుసంధానించండి..



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సుజాతనగర్: సింగభూపాలెం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగభూపాలెం గ్రామ రైతులతో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చెరువులకు అనుసంధానం చేసి గోదావరి జలాలను సాగు భూములకు అందించాలని కోరారు. జిల్లాలో గోదావరి నది ప్రవహిస్తున్నా రైతులకు సాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా రైతుల కష్టాలు తీర్చే విధంగా జిల్లా మంత్రులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

మతోన్మాదం.. సమాజ పురోగతికి విఘాతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): మతోన్మాదం, ఉగ్రవాదం సమాజ పురోగతికి విఘాతమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలో మంగళవారం జరిగిన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు భావజాలం విస్తరిస్తోందని పేదవర్గాలు, కార్మికులు, కర్షకుల అభ్యున్నతికి మలిచే బాధ్యతను సీపీఐ స్వీకరిస్తుందన్నారు. మతోన్మాదం, ఉగ్రవాదం రెండూ అంతమైతేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సింధూర్ యుద్ధంపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ చేసిన వ్యాఖ్యలపై గగ్గోలు పెట్టిన కాషాయమూక ట్రంప్ సూచనతో యుద్ధం ఆపితే నోరుమెదపరెందుకని ప్రశ్నించారు. దేశపాలన ట్రంప్ కనుసన్నలలో నడుస్తోందని ఆరోపించారు. పహల్గాం యాత్రికుల మరణం, ఉగ్రదాడిని ఎన్నికలలో సీట్లు పెంచుకోవడానికి మాత్రమే మోదీ ఉపయోగించుకుంటున్నాడని, దేశంపై ప్రేమతో కాదని విమర్శించారు. ఎస్‌కే సాబీర్‌పాషా, బి.అయోధ్య, ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వర్లు, ఎస్‌డీ సలీం, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుప్రసాదరావుకు నివాళి...

పేదప్రజలకు సేవలందించడం ద్వారా ఆళ్ల గురుప్రసాదరావు జననేతగా పేరు సంపాదించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాదరావు సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. మొదట గురుప్రసాదరావు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వై.ఉదయ్ భాస్కర్, బాగం హేమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను రద్దు చేయాలి..

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చేందుకు ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తోందని, తక్షణం రద్దు చేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు నబీ, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని గోవింద్ సెంటర్‌లో పెన్షనర్ భవన్‌లో ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమాయకపు ఆదివాసీలపై మావోయిస్టు ముద్ర వేసి హతమారుస్తున్నారని తెలిపారు. తక్షణం సైన్యాన్ని వెనక్కి రప్పించాలని కోరారు. కోట్ల విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసీ చట్టాలను ఉల్లంఘిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. ఈ సమావేశంలో టి.నాగేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, మోకాళ్ల రమేష్, వజ్జా సురేష్, ఎండీ రాసుద్దీన్, సారంగపాణి, డి.ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, పూనెం రంగయ్య, ఎట్టి నర్సింహారావు, రావూరి ఉపేందర్, మేకల వినోద్, మోకాళ్ల రమేష్ పాల్గొన్నారు.అ

శీతల గిడ్డంగి నిర్మాణంపై శీతకన్ను

- ఆదాయం పెంపుపైనే ఇల్లెందు మార్కెట్ దృష్టి
- పంట పండించడం కంటే నిల్వ, విక్రయమే రైతులకు సమస్య
- రూ.కోట్ల ఆదాయం వస్తున్నా సౌకర్యాలు నిల్
- ఎవరికీ పట్టని అన్నదాత ఆవేదన



మిర్చి ఏరివేత పనిలో కూలీలు (ఫైల్)



ఆశాజనకంగా కాకరసాగు

ఇల్లెందురూరల్: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ద్వారా ఏటా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. కానీ పంట ఉత్పత్తుల నిల్వ, విక్రయ సౌకర్యాల కల్పనపై పట్టించుకోవడం లేదు. ఫలితంగా నేటికీ పంట ఉత్పత్తులను రైతులు ఖమ్మం వరకు వెళ్లి విక్రయించుకోవాల్సిన దుస్థితి. ప్రధానంగా మండలంలోని ఉద్యాన రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమస్యను అధిగవించేందుకు అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

విక్రయమే ప్రధాన సమస్య...

మండలంలో ఉద్యాన పంటలైన మిర్చి, మామిడి, కూరగాయలు సుమారుగా వెయ్యికి పైగా ఎకరాల్లో సాగవుతున్నాయి. విక్రయ సౌకర్యాలు లేక రైతులు ఆయా పంటలపై ఆసక్తి ఉన్నా మొక్కజొన్న, పత్తి పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా మిర్చి, మామిడి విక్రయానికి జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేదు. ఈ ఏడాది మిర్చి కొనుగోలుకు మార్కెట్ పరిధిలోని టేకులపల్లిలో శ్రీకారం చుట్టినా సౌకర్యాలు లేక అత్యధికులు ఖమ్మం బాట పట్టారు. కూరగాయల రైతులు కూడా సౌకర్యాలు సరిగా లేక వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి వెనుదిరగక తప్పడం లేదు. ఇక మామిడి రైతులు ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి కాయలను విక్రయిస్తున్నారు.

ఈ ఏడాది ఆదాయం రూ.5.13 కోట్లు..

పంట ఉత్పత్తుల విక్రయ సెస్సు రూపంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డుకు రూ.5.13 కోట్లు ఆదాయం వచ్చింది. ఇలా వచ్చే ఆదాయాన్ని మార్కెట్ కమిటీ అధికారులు ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. మార్కెట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వేతనాలు, ఇతరత్రా ఖర్చులను ప్రభుత్వం తిరిగి నిధులు మంజూరు చేస్తుంది. అవసరమైన పనుల కోసం తీర్మానం రూపంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు తిరిగి నిధులు మంజూరు చేయించుకోవడం మార్కెట్ కమిటీల విధిగా మారిపోయింది.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంపై పట్టింపేది..?

సాధారణంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికార పార్టీ చేత నామినేట్ చేయబడుతుంది. కాస్తో.. కూస్తో రాజకీయ పలుకుబడి ఉన్న వారికే ఈ పదవులు వరిస్తాయి. ఈ క్రమంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించుకోవడం కమిటీ బాధ్యునికి పెద్ద కష్టం కాబోదు. అంతేకాకుండా రూ.కోట్ల ఆదాయం వస్తున్న చోట కొద్దోగొప్పో నిధులు మంజూరు చేయడం ప్రభుత్వానికి పెద్దగా ఇబ్బంది ఉండబోదు. ఈ పరిస్థితిలో రైతులకు అవసరమైన సౌకర్యాలపై మార్కెట్ కమిటీ దృష్టి సారించాలి. కానీ గోదాముల నిర్మాణంపై చూపుతున్న ఆసక్తి శీతల గిడ్డంగుల (కోల్డ్ స్టోరేజీ) నిర్మాణంపై చూపకపోవడం విడ్డూరం. ఉద్యాన పంటలైన మామిడి, కూరగాయలు ఒకటి, రెండు రోజులు మినహా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. వారం వరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజీలు అవసరం. మిర్చికి మంచి ధర పలికే వరకు నిల్వ చేసుకునేందకు కోల్డ్ స్టోరేజీలు అవసరం. కానీ ఒక్క ఇల్లెందు మండలంలోనే కాదు ఏకంగా జిల్లా మొత్తంగా ఒక్క కోల్డ్ స్టోరేజీ లేకపోవడం కారణంగా రైతులు తమ ఉత్పత్తులను సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ప్రైవేటు నిర్మాణాలకు చట్టాలే అవరోధం...

ఇల్లెందులో మున్సిపాలిటీ మినహాయిస్తే మిగిలిన ప్రాంతమంతా ఏజెన్సీనే. సాధారణంగా కోల్డ్ స్టోరేజీ నిర్మాణం రూ.కోట్ల వ్యయంతో కూడిన వ్యవహారం. రాష్ట్ర వ్యాప్తంగా మైదాన ప్రాంతాలలో బడాబాబులు బ్యాంకుల నుంచి రుణాలు స్వీకరించి కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తుంటారు. కానీ ఇల్లెందులో ఏజెన్సీ చట్టాల వల్ల బ్యాంకర్లు రుణాలివ్వకపోవడంతో వీటి నిర్మాణానికి ఎవరూ సాహసించలేదు. ఇటువంటి పరిస్థితిలో ప్రభుత్వం మార్కెట్ కమిటీ ద్వారా అయినా కోల్డ్ స్టోరేజీ నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు అందజేశాం..



కూరగాయలు, మిర్చి పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణం అవసరాన్ని గుర్తించాం. ఇప్పటికే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లా. ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరు చేస్తారన్న విశ్వాసం ఉంది.

– బానోత్ రాంబాబు, చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇల్లెందు